# అమానుషం

బియ్యీడీ ట్రెయినింగ్ కాలేజిలో చేరి—ఏదీ ఓ నెలైనా తిరగలేదనుకుంటాను ... సెక్రటరీ ఎలక్షన్సు. ఉన్న ఏభై మంది ఆడపిల్లల్నీ ఉద్దేశిస్తూ "బిలవ్డ్ సిస్టర్స్ .." అని మొదలుపెట్టి ఉపన్యసించిన రమణమూర్తిని గూర్చి ఆలోచిస్తే ఆశ్చర్యం కలుగుతుంది నాకు.

బిలవ్డ్ సిస్టర్స్ ... అని ఎంత హాయిగా అన్నాడని! అలా అంటే ఏ అమ్మాయి అతన్ని గెలిపించకుండా ఉంటుంది? ప్చ్ నాకా అదృష్టంలేదు- ఉన్నా నేను అలా అనగలనా? నాకేదో బిడియం. అలా అమ్మాయిల్ని అనాలనే వుంటుంది కాని ఏమనుకుంటారో.

అమ్మా, నాన్నా పోనీ ఎలానూలేరు, నాదంటూ ఓ చెల్లి వుంటే ఎంత బాగుండు ననిపిస్తూంటుంది. కాని ఈ పాతికేళ్ళ వయసులో "చెల్లీ" అంటూ ఎవరైనా పిలిస్తే హృదయ పూర్వకంగా పలికే వాళ్ళుంటారా అని అనుమానం వస్తుంది.

మామయ్య చిన్నప్పటినుండి కట్టుబాట్లలో ఉంచేసి నన్నిలా పెంచాడు, బహుశా భారతిని కాదని ఎవరైనా చేసేసుకుంటానన్న భయమేమో!

ఇవాళ కమలాదేవిని చూసాను.

చెయ్యెత్తి నమస్కరించాలని బుద్ధి పుట్టింది ... ఛ ఛ కాదు, ఇన్నాళ్ళబట్టీ ఎంతో ఆవేదనగా ఏదో లేదని ఎక్కడెక్కడో వెతుకుతున్న నాకు కనిపించిన ఈ కమలాదేవిని గట్టిగా, కాలేజికంతకూ

వినిపించేటట్టుగా "చెల్లీ" అని పిలిచేద్దామన్నంత ఉత్కంఠ కలిగింది. పరిగెత్తుకుని వెళ్ళి రెండు చేతులూ పట్టుకుని, మామయ్యగారింటికి తీసుకువెళ్ళి "నీ ఆడపడుచు భారతీ" అంటూ చూపిద్దామన్నంత తొందర పుట్టింది. "అమ్మా కమలా! నీకేవిటి కావాలి ... పౌళ్ళ నెక్లెసు కావాలా ... పీచు మిఠాయి కావాలా ... మొగలి పువ్వులు కావాలా. మొగలి పువ్వంటి బావగారు కావాలా..." అనడిగేసి ఆటలు పట్టించేయాలన్నంత సరదా వేసింది—

కాని — కాని — ఏవీ చేయలేకపోయాను — కమలాదేవిని చూడటం తప్పించి. నా అశక్తతకు విచారించేను. అయితే కమలాదేవి కూడా నన్ను చూడడంతో తృప్తి కలిగింది.

రోజూ అనుకునేవాణ్ణి — రేపు ఏదో వంక పెట్టి కమలాదేవితో మాట్లాడేయాలి. పుస్తకాలు కావాలంటే ఇవ్వాలి. సిటిజన్‌షిప్ రికార్డుకు మంచి కలెక్షన్లు ఇవ్వాలి. రాత్రంతా కూర్చునైనా నోట్సాఫ్‌లెసన్స్ వ్రాసి సాయం చెయ్యాలి. రెండు వందల మందిలోనూ కమలాదేవి నీ టి రికార్డు ఫస్టుగా ఉంది". అంటూ ప్రిన్స్‌పాల్‌గారంటూంటే హృదయం నిండుగా ఆనందించాలి.

అలా అనుకోవటం, కమలాదేవి ప్రక్క చూడటం మాత్రం మిగిలింది నాకు. కమలాదేవి కూడా క్లాసులో చూస్తుండేది.

రమణమూర్తి రిక్వెస్టుమీద నేను కూడా కాన్వాసింగ్ మొదలు పెట్టాను. అతని కోరికమీదే ఆడపిల్లలకి రింగులీడర్ లాంటిదైన షరీలా దగ్గరకూడా వెళ్ళాం.

షరీలా అందంగా వుంటుంది. తెల్లని పల్చని బుగ్గలు. రావాలని వచ్చినట్టుగా నుదుటిమీద కదుల్తున్న ముంగురులు. ఆ ముంగురుల

వెనుకవున్న నుదురు బొట్టులేకుండా శుభ్రంగా తుడిచివేసిన మెయిన్ రోడ్‌లా వుంటుంది.

"సిస్టర్! మీ ఆడపిల్లల ఓట్లన్నీ నా పరంచేస్తే — నాకు ఉపన్యాసాలు రావుగనుక ఏంచేస్తానో చెప్పలేనుగానీ మీకు క్లాసులో ఇబ్బంది లేకుండా చూడగలను" అని ఒకే బాణం వదిలిన రమణమూర్తిని బాణాల్తో గుచ్చేస్తున్నట్లుగా చూస్తూ అంది షరీలా.

"ఎలక్షన్‌లో నిలబడేవారు అలాంటి వాగ్దానాలు చెయ్యడం ఇదివరకటినుంచీ చూస్తున్నదేనండి రమణమూర్తిగారూ" అంది.

షాక్ తిన్నట్టుగా అన్నాడు రమణమూర్తి "పోనీ మిమ్మల్ని నమ్మించేందుకేం చెయ్యమన్నారో చెప్పండి — చేస్తాను. ఉన్న ఏభై మంది సిస్టర్స్‌కి సి. టి. రికార్డులు నేనే తయారు చేసేదా?" అన్నాడు ఉద్వేగంగా.

"అబ్బే, నేనేదో హాస్యానికన్నాను అయినా నా సి. టి. రికార్డు ఇస్తాను. తయారుచేసి పట్రండి. మా ఇంటికి తీసుకు వస్తారు కదూ" అంది నవ్వుతూ షరీలా. వెళ్తూ వెళ్తూ "అపరంగానైనా ఈ అన్నయ్యగారు మా ఇంటికి వస్తారు" అంది.

చిన్నప్పటినుండి రికార్డులు తయారు చెయ్యటంలో బొత్తిగా నేను పూర్. అందుకే "రీరైట్" అనేసారు ప్రిన్సిపాల్. అంతమంది లోనూ నేనొక్కణ్ణే ఆ రిమార్కు పొందినవాణ్ణి. అందుక్కాదుగాని రెండు వందల మందిలోను...కమలాదేవి సి.టి. రికార్డు ఫస్టుగావుంది" అని ప్రిన్సిపాల్ గారంటే అవాక్కయి పోయాన్నేను.

ఆవేళంతా మనస్సదోలా అయిపోయింది. కాలేజీనుండి ఇంటికి వెళ్ళిపోతూంటే ఎవరో పిల్చినట్టయి వెనక్కి చూసాను. కమలాదేవి వస్తోంది.

"మీరు మరీ డీలా పడిపోకూడదండీ—సి. టి. రికార్డేగా—కలెక్షన్సు నేనిస్తాను—మాడల్‌గా సి టి. రికార్డుకూడా ఇస్తాను. మళ్ళీ తయారు చెయ్యండి" అంది కమలాదేవి తనకు తానుగా.

నేను మాట్లాడలేకపోయాను ఈ అనుకోని ఆప్యాయతకి

"ఏం అలా చూస్తున్నారు ? ఓ అమ్మాయి దగ్గిర పుచ్చుకోవడమనా ? ఏం పర్లేదు. మీ కూరికే ఇవ్వడంలేదు, నాకూ ఓ సాయం చేస్తారనీ—" అంది నడుస్తూనే.

"తప్పకుండా. చెప్పండీ...చేస్తాను." అన్నాను

"మీ క్రిటిసిజమ్ లెసన్ విన్నాను. నోట్సాఫ్ లెసన్ చాలా బావుంది కూడా— నాకో లెసన్‌కి అలా వ్రాసి ఇస్తారా ?" అంది కమలాదేవి నా కళ్ళల్లోకి చూస్తూ.

"తప్పకుండా"—అన్నాను.

"అయితే ఇప్పుడే రండి మా ఇంటికి— మీ కా రికార్డు ఇస్తాను" అంది కమలాదేవి.

అప్పటికే లేటయిపోయింది ఇంటికి వెళ్ళడానికి. మామయ్య ఏమైనా అంటాడేమో... భారతి ఏమైనా అనుకుంటుందేమో.

అయినా కమలాదేవితో వెళ్ళాను రికార్డు కోసం.

చిన్న ఇల్లు. ఆ ముందునున్న కొద్దిపాటి జాగాలోనే కూరగాయ మొక్కలు అవీ వేసి ఉన్నాయి. చుట్టూఉన్న కంచెకున్న వెదురు గేటు తీసుకుని లోపలికి వెళ్లగానే "అక్క——అక్క" అంటూ వగరుస్తున్నట్టుగా మాట్లాడుతున్న రెండేళ్ళ పాప అంతవరకూ ఎత్తుకున్న అమ్మాయి చేతిలోంచి జారిపోవటానికి ప్రయత్నిస్తోంది.

"ఏవిటమ్మా — అల్లరి—" అని ముద్దుగా అడుగుతూ— "మా చిన్న చెల్లి. ఇంతవరకూ ఎత్తుకుందే అది పెద్దచెల్లి. మేం ముగ్గురం

కాకుండా మరో ముగ్గురు మగ పిల్లలూ ఉన్నారు. బళ్ళో కెళ్ళారు' అని చెప్తూ చిన్న చెల్లిని నా చేతికి అందించింది, చనువుగా కమలాదేవి.

పిల్లలతో నాకు అట్టేకలివిడిలేదు. ఎత్తుకోటంలో అవస్థ పడు తూంటే నులకమంచం వాల్చింది "మా చవక బారు ఆతిథ్యానికేవీ అనుకోకండి" అంటూ.

నేను చాలాఫీలయ్యాను ఆ మాటకి. కాని బాధ వ్యక్తంచేసేలోపలే కమలాదేవి లోపలికి వెళ్ళి గ్లాసుతో కాఫీ తెచ్చి ఇచ్చి ఆ మంచంమీదనే నాక్కొంచెం దూరంలో కూర్చుంది. నా ఒళ్ళో చెల్లి, నా చేతిలో అమృతం.

నాకు ప్రక్కనే కమలాదేవి. మనసుకోని ఆప్యాయత పొంగి పోయి పలక మారింది.

"అయ్యయ్యో, పలక మారిందే" అంటూ గబుక్కున కాఫీ గ్లాసు అందుకుని నా నెత్తిమీద అరచేతితో తట్టింది. అంతలోనే ఏవను కుందో తప్పు చేసినట్లుగా దూరంగా వెళ్ళిపోయింది కమలాదేవి.

తరువాత సి. టి. రికార్డు తెచ్చి ఇచ్చింది.

"మీ నోట్సు ఇవ్వండి, నోట్సాఫ్ లెసన్ వ్రాసేస్తాను" అన్నాను.

"అబ్బే, ఇప్పుడొద్దు లెండి, మళ్ళా అడుగుతాను" అంది తడ బడుతూ. ఎందుకో నాకు బొత్తిగా అర్థం కాలేదు.

కొద్దిసేపు కూర్చుని చిన్న చెల్లిని అందించేసి "మరి వస్తానండి" అంటూ బయటికి వచ్చేసాను.

ఇంటికి వచ్చేసరికి ఆరు కావస్తోంది. వచ్చినా వచ్చినట్టులేదు. కమలాదేవి ఆప్యాయత ఓ వైపు, తడబాటు ఓ వైపు ఆశ్చర్య పరుస్తూంటే ఆలోచిస్తూ అన్యమనస్కంగా గుమ్మమెక్కాను.

"ఏవండీ బావగారూ ఇప్పుడా రావటం! మీ కోసం ఇక్కడ కాచుక్కూచుంటానని తెలిసేనా ఎక్కడెక్కడో తిరిగి వస్తున్నారు?" కోపంగా గుమ్మంలోనే ఎదుర్కొంది భారతి.

"అది కాదు భారతీ నా సి. టి. రికార్డు మళ్ళీ వ్రాయవలసి వస్తే మా క్లాసులో ఫస్టుగా తయారుచేసిన అమ్మాయి రికార్డు తీసుకోటానికి వెళ్ళాను. అంచేత ఆలస్యమైంది" అన్నాను. ఆ సమయంలో భారతికి అనుమాన మెక్కడొస్తుందోనన్న జ్ఞానమే లేదు నాకు.

అక్క చెల్లెలింటికి వెళ్ళానని చెప్పినట్టుగా అమాయికంగా చెప్పాను.

"ఎవరో ఆ అమ్మాయి?" అని క్రాస్ చేసింది.

"కమలాదేవని ఓ అమ్మాయుంది భారతీ. నాకు చెల్లిలాగా కన్పిస్తుంది..." అంటూ ఇంకా ఏదో చెప్పబోయాను.

"నేనొక్కటి చెప్తాను. ఏవనుకోకు బావా. ఎవరో పరాయి అమ్మాయిని నిజంగానే మనసులో వున్నాలేకపోయినా "చెల్లీ" అనడం నాకేవిటో కంపరంగా ఉంటుంది సుమీ—" అంది భారతి.

"అదేమిటి భారతీ అలాగంటావ్... ఇంతవరకూ అమ్మా, నాన్నా, అక్కా, చెల్లీ ఎవరూ లేని నాకు ఇన్నాళ్ళకో చెల్లి దొరికిందనుకుంటూంటే కాదంటున్నావ్. నువ్వేమైనా అనుకుంటావేమోనని చెప్పడం కాదు, నిజంగా ఆ అమ్మాయి నాకు చెల్లే..." ఇంకెలా చెప్పాలో తెలియ లేదు నాకు.

'కాదనలేదు, కాదనడానికి నువ్వు ఒప్పుకోవు కూడా, కాని నేననేది నీకు తెలియని నీ కాన్షస్ కాదనవచ్చు"—

ఏవిటో వింత విషయం విన్నట్టుంది నాకు. అంటే చెల్లి అనుకుంటున్నది నేను అన్నమాట. నాకు తెలియని నేను మాత్రం చెల్లికాదు అంటుందా? ఛ ఛ... నెవ్వర్...

"సర్లేగాని ... ఇవ్వాళ్ళేం ప్రోగ్రాం వేసుకున్నామో జ్ఞాపక ముందా ?" విసుగ్గా ముఖం పెట్టి అంది భారతి. జ్ఞాపకం చేసుకోవ టానికి ప్రయత్నించాను. "సినిమాకి ... లే ... తొందరగా తయా రయితే ఇప్పుడైనా టైముకి చేరుకోవచ్చు" అంది.

నాకు వెళ్ళాలని లేదు కాని తప్పదు.

సినిమా చూస్తున్నానేకాని ఇవాళ జరిగినవన్నీ ఒక దాని తర్వాత ఒకటి మళ్ళీ మళ్ళీ జ్ఞాపకం వస్తున్నాయి. కమలాదేవి పాపని అందించడం — పలకమారితే నెత్తిని అరచేతితో తట్టడం ... అంత లోనే తడబడటం ... భారతి చెప్పిన కాన్షస్ ...

కమలాదేవి ఎందుకు తడబడింది ? తనకు తానుగా నోట్సాస్ లెసన్ వ్రాయమన్నది. తీరా వ్రాస్తానంటే ఎందుకు వద్దన్నది? ఎందుకు? ఎందుకు ?

ఈ ప్రశ్నల మధ్య రెండు వరసల ముందు కూర్చున్న జంట నా కళ్ళలో పడింది. మాటిమాటికి కిలకిలా నవ్వటం ... అతను, ఆమె భుజంమీద చెయ్యి వెయ్యటం... ఆమె ఆచేతిని మరింత దగ్గరగా బంధించుకోవటం...

ఈ గందరగోళం మధ్య ఇంటర్వెల్ నిజంగా విశ్రాంతి నిచ్చింది.

అయితే ముందు వరసలో కూర్చున్నవాళ్ళను చూసేనరికి మళ్ళా మతిపోయింది నాకు. వాళ్లు మరెవరో కాదు, రమణమూర్తీ, షరీలా!

ఛీ ఛీ ... సిస్టర్ సిస్టర్ అని అన్ని కబుర్లు చెప్పాడు. ఇప్పుడు చేసిందేవిటి ?

ఏమో ! సిస్టర్‌తో సినిమాకు రాకూడదా ?

వస్తే, సినిమాలో అలానే ప్రవర్తిస్తారా ?

ఏమో ! నాకు అలా కనిపించిందేమో !

"బావా! ఉండు...మా ఫ్రెండ్‌ని పలకరించి వస్తాను..." అని లేవబోయింది భారతి.

"ఎవరు ?" అనడిగాను. "అదిగో రెండు వరసల ముందు కూర్చుందే... షరీలా అని, నీకు తెలిసే వుండాలే. తను బియ్యాడీ అవుతోంది" అని వెళ్లబోయింది.

"ఇప్పుడెందుకులెద్దూ... తరవాత పలకరించవచ్చు. అతనెవరో ఉన్నాడు కదా" అన్నాను ఇష్టంలేనట్టు.

"ఎవరో ఏమిటి? షరీలా అతన్ని పెళ్ళిచేసుకోబోతోంటే...అందుకే వెళ్ళి కంగ్రాచ్యులేట్ చేద్దామనుకున్నా... పోన్లే ఇంకోసారి మాట్లాడొచ్చు, వాళ్ళ నెందుకు డిస్టర్బ్ చేయడం ?" అంది చిలిపిగా నవ్వుతూ భారతి. కాని భారతి నవ్వులో మునిగి తేలే మూడ్‌లో లేను.

సినిమా మళ్ళీ ప్రారంభించేసరికి నా ఆలోచనలు మళ్ళీ ప్రారంభమయ్యాయి. కమలాదేవి కాఫీ ఇవ్వడం ... పలకమారటం ... చేతితో తట్టటం ... తడబడటం ... భారతి చెప్పిన కాన్షస్ ... రమణమూర్తి షరీలాని సిస్టర్ అనటం ... షరీలా "ఆ పరంగానైనా ఈ అన్నయ్యగారు మా ఇంటికి వస్తారు—" అని నవ్వడం— ముందున రమణమూర్తి షరీలామీద చెయ్యి వెయ్యడం - షరీలా ఆ చేయి దాటిపోతుందేమోనని గట్టిగా పట్టుకోవడం - వాళ్ళ పెళ్ళి - ఇవన్నీ ఒక్కొక్కటి ఒక్కొక్క సుత్తి దెబ్బలాగా నెత్తిమీద తగుల్తున్నాయి.

"అబ్బ ... తల నొప్పిగా వుంది భారతీ ... పోదామా" అన్నాను.

భారతికి ఇష్టం లేకపోయినా..., ఎప్పుడూలేని నా వింత ప్రవర్తనకు ఆశ్చర్యపోయి సరేనంటూ లేచింది.

ఇంటికొచ్చినా మనసు మనసులో లేదు.

మంచంమీద పడుకున్నాను. ఇవేళ జరిగిన ఒక్కొక్క సంఘటన ఒక్కో ముల్లై గుచ్చుకుంటుంటే మామయ్య అతి జాగ్రత్తగా పెంచిన ఈ లేత హృదయం బాధగా అటూఇటూ కదిలించి మంచంమీద.

ముఖ్యంగా రమణమూర్తీ, షరీలా ... సిస్టర్ ... బ్రదర్ అనుకోవటం ... సినిమాలో అలా ప్రవర్తించటం ... కమలాదేవి చనువుగా నా నెత్తిమీద అరచేతితో తట్టటం ... తప్పుచేసినట్టు తడబడటం ...

ఈ ఆలోచనల మధ్య ఎప్పుడు నిద్రపోయానో ...

ఒళ్ళంతా ఎవరో చేతుల్తో బిగువుగా బంధించినట్టనిపిస్తే చట్టున లేచికూర్చున్నాను. లైటువేసి మత్తు వదిలించుకున్నాను. ఏమీలేదు...

ఏదో లీలగా జ్ఞాపకం వస్తోంది. ఏమిటి ? కల ... కలలో కమలాదేవి ... దగ్గరికి రావటం ... చేతుల్చాపడం ... ఒళ్లంతా చేతుల్తో బిగువుగా బంధించేస్తుంటే ...

ఛీ ఛీ, ఏమిటిది? ఏవిటీ కల? ఈ కల కర్థం ఏమిటి? కమలాదేవి నాకు చెల్లికాదా... అయ్యో అనుకుంటూ మంచంమీద రెండు చేతుల్లో ముఖం దాచుకొని కూర్చున్నాను.

'బావా! కమలాదేవిని చెల్లి అనుకుంటున్నది నువ్వు. కాని నీకు తెలియని నీ కాన్షస్‌నెస్‌కు చెల్లికాదన్నమాట. కమలాదేవి పరాయిదని నీ మనసులో ఏమూలో వుంది. ఉంటుంది. అందుకే—అందుకే

నేనొకటి చెప్తాను. ఏమనుకోకు బావా. ఎవరో పరాయి అమ్మాయిని నిజంగా మనసులో ఉన్నా లేకపోయినా చెల్లీ అనడం నా కేవిటో కంపరంగా ఉంటుంది సుమీ!' అంటూ భారతి నా ముఖంమీది చేతు ల్తీసి, తల నిమిరి మెడవరకు దుప్పటికప్పి చెంపమీద చల్లగా జోకొట్టినట్టుగా అన్పించి మళ్ళీ నిద్రపోయాను.

(పొలికేక)